క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

పరిగి: డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు పరిగి ఆర్టీసీ డీఎం పవిత్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో సంస్థ సేవలపై ఆర్‌ఎంకు తెలిపేందుకు వీలుంటుందని తెలిపారు. బస్సులు సక్రమంగా రాకున్నా, మరేదైనా ఆర్టీసీ సమస్యలు ఉంటే సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమంలో 99592 26241 నంబర్ ద్వారా సమస్యలు తెలపాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి



నేత్ర శిబిరం సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతగిరి: కంటి సమస్యలు ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేటలో నిర్వహిస్తున్న కంటివెలుగును ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ.. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ బంధు అమలు చేయాలి

ధారూరు: దళితులకు దళితబంధు అమలు చేస్తున్నట్లుగా ముస్లింలకు మైనార్టీ బంధు పథకాన్ని ఇవ్వాలని బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్.. తర్వాత విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికైనా 12శాతం రిజర్వేషన్‌తో పాటు మైనార్టీ బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పలువురు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వార్డు కౌన్సిలర్ వరాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో గులాబీ జెండా తాండూరులో ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

కొనసాగుతున్న ‘తట్టెపల్లి’ సాధన దీక్ష



దీక్షలో సమితి సభ్యులు

పెద్దేముల్: తట్టెపల్లి మండలం కోసం మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష బుధవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శంకర్‌నాయక్, సాధన సమితి సభ్యుడు గోపాల్, జైపాల్, హిమ్రాన్, సాజిద్, అఫ్సర్, పండరి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం తట్టెపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు దీక్ష కొనసాగుతుందని సమితి సభ్యులు తెలిపారు.

మణికంఠకు నందిశంకర పురస్కారం

కుల్కచర్ల: ఆది శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని నగరంలో శ్రీ త్రినయన కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కుల్కచర్లకు చెందిన మడపతి మణికంఠకు నంది శంకర పురస్కారాన్ని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అందజేశారు. ఏటా శంకరాచార్యులు జయంతి సందర్భంగా పురోహితం చేస్తున్నవారిలో వారి సేవలను బట్టి కొందరిని ఎంపిక చేసి, ఈ పురస్కారాన్ని అందజేయడం ఆనవాయితీగా వస్తోంది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బంట్వారం: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని చెప్పారు.

ఆసుపత్రిలో వసతులు నిల్

- వేధిస్తున్న వైద్యుల కొరత
- శిథిలావస్థలో సిబ్బంది క్వార్టర్స్
- స్థానికంగా ఉండని వైద్య సిబ్బంది
- అత్యవసర సమయంలో అందని వైద్యం



శిథిలావస్థకు చేరిన సిబ్బంది గదులు

పెద్దేముల్: ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల లేమితో వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 37 గ్రామ పంచాయతీలు, సుమారు 44వేల జనాభాకు ఈ సర్కారు దవాఖానే దిక్కు. గతంలో ఇద్దరు వైద్యులు, పూర్తి స్థాయిలో సిబ్బంది, క్వార్టర్స్, అంబులెన్స్, కు.ని. థియేటర్ ఉండేది. ప్రస్తుతం డాక్టర్, సిబ్బంది గదులు కూలి పోవడంతో సిబ్బంది వలస బాట పట్టారు. దీంతో అత్యవసర సమయంలో చికిత్స అందక రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల గడప తొక్కుతున్నారు. గతంలో పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటల పాటు వైద్య సేవలు అందేవి. ప్రస్తుతం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకే పరిమితం కావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పెద్దేముల్ మండలంతో పాటు బంట్వారం, ధారూర్ మండలాల ప్రజలతో పాటు కర్ణాటక కుంచారం ప్రాంతం నుంచి వైద్యం కోసం ఇక్కడికి వచ్చేవారు. కానీ పీహెచ్‌సీ సమయపాలన మార్చడం, వైద్య సిబ్బంది కొరతతో ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్తున్నామని గాజీపూర్, నాగులపల్లి, ఇందూరు, మంబాపూర్, మారేపల్లి, జనగాం, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్ వాసులు వాపోతున్నారు. పేరుకు ఆసుపత్రే అయినా.. వైద్యం అందడం లేదంటున్నారు. ఇలా అయితే ఇబ్బందిగా ఉందని, పాత పద్ధతిలో 24గంటల వైద్య సేవలతో పాటు, సిబ్బంది ఇక్కడే ఉండేందుకు సౌకర్యాలు కల్పించాలని, కు.ని. శస్త్రచికిత్స, కుక్క, పాము కాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరు పడకల ఆసుపత్రికి బదులు 30 పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలి. ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎనిమిది గంటలకు బదులు 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అత్యవసర సేవలు అందించాలి.

– రియాజ్, మైనార్టీ నాయకుడు పెద్దేముల్

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం



పీహెచ్‌సీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని వసతులు కల్పించేలా కృషి చేస్తాం. ఎమ్మెల్యే సహకారంతో ప్రస్తుతం రూ.1.5 కోట్ల నిధులతో కొత్త భవనం మంజూరు చేయించాం. పనులు ప్రారంభమయ్యాయి. దాంతో పాటు సిబ్బంది గదులకు నిధులు మంజూరయ్యేలా చూస్తాం. ప్రైవేట్‌కు దీటుగా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

– అనురాధ, ఎంపీపీ, పెద్దేముల్

పంచాయతీ భవనానికి పగుళ్లు

బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్: ఇండాపూర్ పంచాయతీ భవనం పూర్తిగా నెర్రెలు వారి ప్రమాదకరంగా మారింది. 2007 సంవత్సరంలో ప్రారంభించిన కార్యాలయంలో ఓ గది సర్పంచ్‌కు, మరో గదిని వీఆర్‌ఓకు కేటాయించారు. వీఆర్‌ఓ వ్యవస్థ రద్దు అయినప్పటి నుంచి వీఆర్‌ఓ కార్యాలయానికి రావడంలేదు. ఇక పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, వార్డు సభ్యులు సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా.. కార్యాలయం మొత్తం ఇలా పగుళ్లు పట్టి.. ఎప్పుడు కూలి, ఎవరి ప్రాణాలకు ముప్పు తెస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏదైనా ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పగుళ్లు పట్టిన గోడలతో జీపీ భవనం

ఆలయ అభివృద్ధికి రూ.80 వేలు విరాళం

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం దాస్యనాయక్ తండాలో స్వయంబు పంచముఖ ఆంజనేయస్వామి వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి తాము వ్యక్తిగతంగా సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.80వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ నాయక్, ఎంపీటీసీ మౌనిక, నాయకులు హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: కల్యాణలక్ష్మి పథకం పేద ప్రజలకు వరంలాంటిదని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. బుధవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఆడపిల్ల అంటే బరువుగా భావించే నాటి పరిస్థితుల నుంచి.. ఆడబిడ్డలే కావాలన్న ఆకాంక్షను కలిగించేలా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని చెప్పారు. కల్యాణలక్ష్మితో యువతుల వివాహానికి ఆర్థిక సహాయం అందజేస్తూ.. పేదింటి సంబురంలో భాగస్వామిగా మారి, వారి ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, తహసీల్దార్ అశోక్‌కుమార్, గిర్దవరి వెంకట గిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు జుబేర్ మహ్మద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి మందిపల్ వెంకట్, స్థానిక నాయకులు మఠం రాజశేఖర్, కొత్త రంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ అమలు చేయని ప్రభుత్వం

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు తీర్చాలి: సీఐటీయూ

పరిగి: అంగన్‌వాడీ ఉద్యోగుల విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని, వెంటనే వారికి గ్రాట్యుటీ అమలు చేసి, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీడీపీఓ ప్రియదర్శినికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీని ఇవ్వాలని గతేడాది ఏప్రిల్ 25న కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ.. ప్రభుత్వం అమలు చేయకపోవడం సరికాదన్నారు. గ్రాట్యుటీకి అన్ని అర్హతలున్నా.. ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని ప్రశ్నించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మంజుల, పుల్లమ్మ, నిర్మల, మల్లమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సుప్రీం తీర్పు అమలుచేయాలి

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీవర్కర్లకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ అర్హత, సమస్యపై గతేడాది ఏప్రిల్‌లో కోర్టు చారిత్రాత్మక తీర్పు చెప్పిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో 70వేల మంది మహిళా కార్మికుల జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తున్న ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. న్యాయస్థానం చెప్పిన విధంగా కనీస వేతనాలు చెల్లించాలని, ఐసీడీఎస్ పటిష్టత కోసం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



పరిగి: సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



అనంతగిరి: సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వెంటనే అమలు చేయాలి

అనంతగిరి: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్ల గ్రాట్యుటీపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షురాలు భారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, మనోహర, శిరీష, కవిత తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్‌తో మొబైల్ ఫోన్ల రికవరీ



మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

బాధితులకు అందజేసిన ఎస్పీ కోటిరెడ్డి

దోమ: సీఈఐఆర్ పోర్టల్‌తో రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బాధితులకు ఎస్పీ కోటిరెడ్డి బుధవారం అందజేశారు. దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 6 చరవాణులను సీఈఐఆర్ ఇన్వెస్టిగేషన్ చేసి వాటిని స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు. దోమ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బందయ్య, ప్రవీణ్‌రెడ్డి, రమేష్, మహేశ్‌కుమార్, గోవర్ధన్, రమేష్‌లు వివిధ కారణాలతో తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. ఆ మొబైల్స్‌కు సంబంధించి స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ విశ్వజన్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఈఐఆర్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యారు. వివరాలు అప్‌లోడ్ చేసి జిల్లా ఐటీ కోర్‌టీం అధికారులను సంప్రదించి వారి సహాయంతో తక్కువ సమయంలో పోయిన ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకోగా.. వాటిని ఎస్పీ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎవరిదైనా సెల్‌ఫోన్ దొంగలించబడినా, లేదా పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందుపర్చాలని, అలా చేసినట్లయితే త్వరగా ఫోన్ల జాడ తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. కావున ప్రజలు ఈ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మురళీధర్, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఐ విశ్వజన్, ఐటీసెల్ ఎస్‌ఐ శైలజ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్ జాగ్రత్త



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శంకర్

బొంరాస్‌పేట: సైబర్ నేరాల పట్ల గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రేగడిమైలారం తదితర గ్రామాల్లో కుటుంబ కలహాలు, భూతగాదాలు, రోడ్డు ప్రమాదాల పట్ల ఎస్‌ఐ అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలు జరిపినప్పుడు ఓటీపీ నంబర్లు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పొద్దన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడపటం వల్లే ప్రమాదలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ కలహాలు, భూతగాదాలకు దూరంగా ఉండాలని, పరిష్కారం కోసం చట్టపరంగా పోలీసులను ఆశ్రయించి సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుబాష్‌నాయక్, గోపాల్ ఉన్నారు.

రూ.17 కోట్లు వెచ్చించినా.. ఇంకా బురదే!

నవాబుపేట: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించడన్నట్లుగా మారింది నవాబుపేట–బంగారు మైసమ్మ రోడ్డు దుస్థితి. రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి భారీగా నిధులు మంజూరైనా.. అధికారులు, నిర్మాణదారుల నిర్లక్ష్యంతో సకాలంలో పూర్తికాలేదు. ఫలితంగా నిత్యం దుమ్ముధూళితో వాహనదారులు ఇబ్బంది పడుతుండగా.. నిన్నమొన్నటి భారీ వర్షానికి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. బంగారు మైసమ్మ ఆలయం నుంచి నవాబుపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం గతేడాది రూ.17 కోట్లు మంజూరయ్యాయి. పనులు సైతం నడుస్తున్నాయి. రోడ్డు నిర్మాణంలో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అది పూర్తిగా పాడైపోయిందని, మట్టిపోసి వదిలేయడంతో భారీ వర్షాలకు బురదమయంగా మారి వాహనాలు నడవలేని దుస్థితికి చేరిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు నిర్మాణం పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు దుస్థితి

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్

అనంతగిరి: జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జెడ్పీ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీల సమావేశంలో ఆయన పలు కమిటీల అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు చేశారు. వేసవిలో తాగునీటి నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నీటి తొట్లలో నీరు నింపి పశువుల దాహం తీర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందించే వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, స్టాండింగ్ కమిటీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మరక్షణకు పాటుపడాలి

వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు

అనంతగిరి: ధర్మరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో బుధవారం నుంచి 7 రోజుల పాటు భజరంగదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శౌర్య ప్రశిక్షణ కార్యక్రమానికి సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. దేశంలో జరుగుతున్న హిందూ వ్యతిరేక చర్యలు అరికట్టాలంటే భజరంగదళ్ ఆధ్వర్యంలో హిందువులు సంఘటితం కావాలని, అప్పుడే దేశంలో ధర్మం రక్షించబడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్, ప్రాంత సంఘటన కార్యదర్శి యాదిరెడ్డి, భజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, కార్యదర్శి శ్రీలత, విభాగ్ కార్యదర్శి భిక్షమయ్య, ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, కోశాధికారి లక్ష్మిశేఖర్, ప్రతినిధులు ప్రభాకర్, స్వప్నప్రియ, దోమ శ్రీకాంత్, సతీష్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ సూచనలు నేటి సమాజానికి మార్గదర్శకం

కుల్కచర్ల: అంబేడ్కర్ సూచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం బూరెడ్డిపల్లిలో బుడగజంగం సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబా సాహెబ్ జీవితకాలం చేసిన పోరాటం మరువలేనిదని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన సూచించిన సూచనలు అందరికీ ఆచరణీయమైన మార్గాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీలకు అండగా ఉంటాం



సంఘీభావం తెలిపిన బీఎస్పీ నాయకులు

అనంతగిరి: సమస్యల సాధనకు సమ్మె చేస్తున్న ఐకేపీ, వీఓఏలకు అండగా ఉంటామని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ప్రతినిధులు క్రాంతికుమార్, పెద్ది అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఐకేపీ వీఓఏ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. సమ్మెకు బీఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచుతామన్నారు. కార్యక్రమంలో ప్రభు, పుల్లయ్య, గోవర్ధన్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



గుముడాల–బిచ్చాల మధ్య రహదారి దుస్థితి

దౌల్తాబాద్: దౌల్తాబాద్ గ్రామం నుంచి గుముడాల మీదుగా బిచ్చాల గ్రామం వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై.. నరకానికి నకళ్లుగా మారింది. అభివృద్ధికి సోపానాలు రహదారులు అనే అధికారులు, ప్రజాప్రతినిధులు.. నిత్యం ఈ దారిలో పయనిస్తున్నారు కానీ.. రోడ్ల దుస్థితిని పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ రోడ్డుపై గోతులు ఏర్పడి, కంకర తేలి ఉండడంతో.. బైక్‌పై కాదుకదా.. కనీసం కాలినడకన వెళ్లలేక లేకపోతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.